క్లుప్తంగా

చుండూరి రవిబాబుకు ఘన సత్కారం


రవిబాబును సన్మానించి మొక్క అందజేస్తున్న రమణారెడ్డి

ఒంగోలు సిటీ: నూతనంగా నియమించిన జిల్లా పార్టీ అధికార ప్రతినిధి నరాల రమణారెడ్డి మంగళవారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రవిబాబును శాలువతో సన్మానించి, మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. తర్వాత ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావును శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో గుండెకు భరోసా

చీమకుర్తి: గుండెపోటు వచ్చిన వారికి రూ.45 వేల విలువ చేసే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ చీమకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సహకారంతో 24/7 ఆస్పత్రిలో గుండెపోటు నివారణకు ఉపయోగించే ఇంజెక్షన్‌లను ఉంచినట్లు తెలిపారు. గుండెపోటు సంభవించినప్పుడు వెంటనే 108 అంబులెన్స్‌లో నేరుగా చీమకుర్తి ప్రభుత్వాసుపత్రికి వస్తే ఈసీజీ తీసి గుండెపోటు అని నిర్ధారణ అయితే తక్షణమే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా గుండెపోటు రోగులకు ఇచ్చి ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని చీమకుర్తి పట్టణంతో పాటు రూరల్ ప్రాంతంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ఇంటింట ప్రచారం



కొత్తపట్నం: గ్రామీణ ప్రాంతంలో ఉన్న దివ్యాంగుల సంక్షేమం కోసమే ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్నామని మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ నాయుడు ఈశ్వరరావు అన్నారు. ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు మండలంలో 15 రోజులు పాటు దివ్యాంగుల సంక్షేమం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా గమళ్లపాలెం –వజ్జిరెడ్డిపాలెం హైస్కూల్‌లో పరిసరాల శుభ్రత, బాల్యవివాహాల వచ్చే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో పీఎల్వీ శింగమనేని ఆంజనేయులు, హైస్కూల్ హెచ్ఎం శివ శంకరరావు, పీడీ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

ఒంగోలు మెట్రో: నయన మనోహరంగా లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. మంగళవారం నగరంలోని గోపాల్ నగర్ మొదటి లైనులో లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీనివాస కల్యాణం, పుష్పయాగాలను నల్లూరి తేజ, ఫణీంద్ర ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పూలతో చూడ చక్కగా అలంకరించి శ్రీనివాస కల్యాణ క్రతువులను నయన మనోహరంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తెగులు.. రైతుల దిగులు

వ్యవసాయం అంటేనే గాలిలో దీపం వంటి పరిస్థితి. విత్తనం వేసినప్పటి నుంచే రైతులకు ఇబ్బందులు మొదలవుతాయి. ఎందుకంటే వేసిన విత్తనం నాణ్యమైనదేనా.. లేదా ? అనేది మొదటి అనుమానం. విత్తనం సరిగా మొలకెత్తుతుందా ? లేదా? అనేది మరో అంశం. అన్నీ సక్రమంగా ఉండి మొలకెత్తినా చేను చీడపీడల బారిన పడకుండా ఉంటుందా ? అనేది మరో సంశయం. ఇలా పంట చేతికందే దాకా ప్రతి దశలోనూ రైతులకు ఇబ్బందులు తప్పవు. కొన్నిసార్లు పెట్టుబడి కూడా రాక నష్టాలపాలవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోకపోవడం మరింత బాధాకరం.


బండ్లమూడిలో బొబ్బర తెగులు సోకిన మిరప పంట

- చీమకుర్తి మండలంలో భారీగా నష్టపోయిన రైతన్నలు
- వరి, మిరప పంటల్లో తెగుళ్లు, పురుగుల విజృంభణ
- 1200 ఎకరాల్లో వరి, 110 ఎకరాల మిరపలో దిగుబడులపై ప్రభావం
- పెట్టుబడి కూడా రాదని.. ఆందోళనలో రైతన్నలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


చీమలమర్రిలో వరి పైరు ఆశించిన తెగులు

<u>చీమకుర్తి రూరల్:</u>

ఆరుగాలం కష్టించి పనిచేసే అన్నదాతకు అడుగడుగునా అవరోధాలే. ఒక పక్క అతివృష్టి, మరో పక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు అన్నదాతను పాతాళానికి తొక్కేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేసిన రైతులు తెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే దశలో వివిధ రకాల తెగుళ్లు ఆశించడంతో దిగుబడులు తగ్గుతాయని, ఏంచేయాలో అర్థం కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల నివారణకు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నా ఫలితం లేదని వాపోతున్నారు. చీమకుర్తి మండల పరిధిలో వరి 1200 ఎకరాలు, మిరప పంట 110 ఎకరాల్లో సాగు చేశారు. అయితే వరి, మిరపలో తెగుళ్ల విజృంభణతో దిగుబడులు పూర్తిస్థాయిలో తగ్గే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిరప పంటకు బొబ్బర తెగులు..

గతేడాది మంచి దిగుబడి, సరైన ధరలతో మిరప రైతులు సంతోషంగా ఉన్నారు. కాని ఈఏడాది మాత్రం మిరపకు తెగుళ్లు ఆశించాయి. మిరప పంటకు బొబ్బర, ఎర్రనల్లి తెగులు సోకడంతో ఆందోళన చెందుతున్నారు. దీనినే నల్లతామర అంటారు. ఈ తెగులు సోకిన చెట్టు ఆకు పూర్తిగా దెబ్బతింటుంది. తామరపురుగు పూత, ఆకును తిని వేయడంతో పాటు రసం కూడా పీల్చుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తెగులు ప్రభావంతో మిర్చి తోటలు వెలవెలబోతున్నాయి. ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టు బడి పెట్టి సాగు చేస్తే తీరా పిందె, పూతదశకు వచ్చే సమయంలో ఈ తెగులు సోకిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నిపురుగు మందులు పిచికారీ చేసినా ఫలితం రావడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి పైరులో కాండం తొలుచు పురుగు

రబీ సీజన్‌లో మండలంలో 1200 ఎకరాల వరకు వరి పైరు సాగుచేశారు. రైతులు రబీ సీజన్‌లో అకాల వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు సంభవించడంతో వరి పైరులో తెగుళ్లు, పురుగు విపరీతంగా వచ్చాయి. అన్ని రకాల క్రిమిసంహారక మందులు వాడినా తెగులు నివారణ అనేది కనిపించలేదు. కాండం తొలుచుపురుగు వలన కూడా వరి పైరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడి వస్తుందా రాదా అని మీమాంసలో ఉన్నారు అన్నదాతలు.

ముంచేసిన కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింది ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతన్నల కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. మేం అధికారంలోకి వచ్చాక ప్రతి రైతుకూ రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తాం.. మీరేం దిగులు పడకండీ అంటూ అబద్ధాల హామీలు ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక తెప్పతగలేసినట్లు ఖజానాలో డబ్బులు లేవు.. ఏం చేయాలో భయం వేస్తోంది అని సీఎం చంద్రబాబు నాయుడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు. ఇటీవల సభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తుంటే ఓరైతు అన్నదాత సుఖీభవ డబ్బులు ఎప్పుడిస్తారని ప్రశ్నించగా.. 'డబ్బుల్లేవు సంపద సృష్టించాక ఇస్తాను. సంపాదన మార్గం ఉంటే నా చెవులో చెప్పు' అంటూ వెకిలి సమాధానం ఇచ్చాడు సీఎం చంద్రబాబు. ఇదీ ప్రస్తుత కూటమి పరిస్థితి. అదే సీఎం గా జగన్ మోహన్‌రెడ్డి ఉంటే అనుకున్న సమయానికి అనుకున్న విధంగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం చేసి ఆదుకునేవారు. ఇలాంటి రోజులు వస్తాయని కలలోకూడా అనుకోలేదని రైతన్నలు వాపోతున్నారు.

క్రిమిసంహారక మందులు పనిచేయడం లేదు..

తెగుళ్ల నివారణకు వరిపైరులో క్రిమిసంహారక మందులు ఐదుసార్లు పిచికారీ చేసినా కూడా ఫలితం కనిపించలేదు. క్రిమి సంహారక మందుల్లో కూడా నాసిరకం మందులు మార్కెట్లోకి వస్తున్నాయి. అధికమైన ధరలు రైతులకు మోయలేని భారంగా తయారై పెట్టుబడి రెండింతలు పెరుగుతోంది.

– అత్యాల అంకయ్య, ఎంపీటీసీ, మంచికలపాడు

ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రంలో తక్కువ ధరకే రైతులకు సత్తువ మందులు అందజేసేవారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇటువంటి మంచి పనులకు ఫుల్‌స్టాప్ పెట్టారు. రేట్లు వారానికి ఒకసారి రెండు మార్లు పెరుగుతున్నాయి. రేట్లు విషయంలో సంబంధిత అధికారుల నియంత్రణ లోపం కనిపిస్తోంది. 20:20 ఫాక్ట్ సత్తువమందు ఒకసారి రూ.1300 మరోసారి రూ.1400 ఉంటోంది.

– యన్నం శేషిరెడ్డి, మాజీ సర్పంచ్, బండ్లమూడి

అకాల వర్షాల వల్ల తెగుళ్లు వ్యాపించాయి..

అకాల వర్షాల వల్ల పంటలో తెగుళ్లు విపరీతంగా వ్యాపించాయి. దానికి తోడు క్రిమిసంహారక మందులు వాడినా కూడా ఫలితం కనిపించలేదు. ముఖ్యంగా మిరపలో 60 శాతం బొబ్బర, నల్ల తామర వల్ల దిగుబడి కూడా తగ్గింది. వరిలో 30 శాతం తెగుళ్లతో పంటనష్టం సంభవించింది.

– డీవీ భాస్కర్, మండల వ్యవసాయాధికారి, చీమకుర్తి

విల్లాలి వీరుడికి ఆభరణ సేవ


ఆభరణ అలంకరణలో అయ్యప్పస్వామి

ఒంగోలు మెట్రో: విల్లాలి వీరుడు అయ్యప్ప స్వామికి విశేష ఆభరణ సేవ నిర్వహించారు. మంగళవారం స్థానిక మంగమూరు డొంక రామాలయం వీధి రంగారాయుడు చెరువు పక్కన వేంచేసియున్న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో అష్టవింశతి (28)వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పరాంకుశ కేశవాచార్యులు, నారాయణం వెంకటరమణ దీక్షితులు శాస్త్రోక్తంగా పూజాక్రతువులు నిర్వహించారు.

ఘంటసాల గీతాలు అజరామరం


ఘంటసాలకు నివాళులర్పిస్తున్న సీఐ సుబ్బారావు, మాధవరావు

చీమకుర్తి: సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన గీతాలు ఇప్పటికీ అజరామరమని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు అన్నారు. ఘంటసాల వర్ధంతి పురస్కరించుకొని అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యానికేతన్ హైస్కూలులోని విద్యార్థులకు నిర్వహించిన పాటల పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మాధవరావుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు

- పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్


నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలు, కొత్తపట్నం సెంటర్‌లో ఉన్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్ చుట్టూ ప్రదేశాన్ని, బంక్ నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ వాహనాలకు నిత్యం వినియోగించే డీజిల్, పెట్రోల్ నిర్వహణకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఒంగోలు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, వన్ టౌన్ సీఐ నాగరాజు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలి

మద్దిపాడు: జిల్లాలో వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని, జిల్లా ఎస్పీ దామోదర్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ను సాధారణ తనిఖీల భాగంగా సందర్శించారు. ఇటీవల కాలంలో మద్యం ఆగి వాహనాలు నడిపే వారిని నియంత్రించడానికి జాతీయ రహదారిపై ప్రత్యేకమైన టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఎస్సై రమేష్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్లో అలసత్వం తగదు

నాగులుప్పలపాడు: పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఏఆర్. దామోదర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అకస్మికంగా సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి స్టేషన్ శుభ్రతలకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతికను ఉపయోగించి ఛేదించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో వివిధ రూమ్‌లు, ఉమెన్ హెల్ప్ డెస్క్‌తో పాటు వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పీడీఎస్‌యూ సంస్థల విలీన సభను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఒంగోలు సిటీ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సంస్థల విలీన సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వద్ద విలీన సభకు సంబంధించిన వాల్‌పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ విద్యా ఉద్యోగ అవకాశాల కోసం, అందరికీ సమానమైన విద్య కావాలని గత 50 సంవత్సరాలుగా రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల కోసం పోరాడుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం చిన్న చిన్న కారణాలతో 2013లో రెండుగా చీలిపోయి, కొంత నష్టాన్ని చవిచూసిందన్నారు. రెండు సంస్థలు చర్చించుకుని, ఫిబ్రవరి 14న నెల్లూరు నగరంలో ఏకం కాబోతున్నాయన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఇంకా అమలు చేయలేదని చెప్పారు. 50 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి తక్షణమే రూ.వంద కోట్ల నిధులు ఇవ్వాలని, ట్రిబుల్ ఐటీకి బడ్జెట్లో నిధులు కేటాయించి సొంత బిల్డింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యాం, జిల్లా నాయకులు సతీష్, యూనివర్సిటీ విద్యార్థులు లక్కీ, మధు, గణేష్, నాగార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే నిర్వహణ


రీసర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

సంతనూతలపాడు: భూముల రీసర్వేలో లోపాలు ఉండరాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె సంతనూతలపాడు మండలంలోని ఎం.వేములపాడులో పర్యటించారు. గొర్లమిట్ట గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈ గ్రామంలో 400 ఎకరాలను సర్వే చేశామని, విలేజ్ బౌండరీ కూడా సర్వే చేశామని, ప్రభుత్వ భూముల సర్వే 50% పూర్తయిందని అధికారులు తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తున్న నాలుగు టీములకు షోకాజు నోటీసులు జారీచేయాలని సర్వే శాఖ సహాయ సంచాలకులు గౌస్ భాషాను కలెక్టర్ ఆదేశించారు. గ్రౌండ్ లెవెల్లో రీ సర్వే సర్వేయర్లకు వీఆర్వోలు గాని, ఇతర రెవెన్యూ సిబ్బంది గానీ, రీసర్వే కు సంబంధించిన రైతులు గాని అందుబాటులో ఉండడం లేదని వారు వాపోతున్నారు. అనంతరం ఎం.వేములపాడు సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో కే లక్ష్మీప్రసన్న, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే రమణ, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, వీఆర్వో ఎం శ్రీనివాసులు, మండల ఇంచార్జి సర్వేయర్ ఏ ప్రవీణ్ కుమార్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరిగా పూర్తిచేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఒంగోలు వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు

సంతనూతలపాడు: ఈ–క్రాప్ నమోదు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించాలని.. రైతు సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు బీ రమేష్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల ఏవోలు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజనులో ఈ–పంట నమోదు ఫిబ్రవరి 15తో ముగుస్తున్నందున రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులు వేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేసి, ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది పంట కోత ప్రయోగాలు సకాలంలో నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా రైతు వారి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ముందుగా భూ యజమానులు, భూ రికార్డులు సరిగా ఉన్న రైతులను గుర్తించి వారికి వెంటనే రైతు వారి రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు పి.పావని, డీవీ భాస్కర్, ఏఈవోలు వెంకటరావు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆధార్ కార్డులు ఇవ్వాలని ఆందోళన


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఒంగోలు సిటీ: నగరంలో గిరిజనులకు ఆధార్ కార్డులు ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కార్యాలయం వద్ద సీపీఐ ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయంలో వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 75 స్వాతంత్ర్యంలో గిరిజనలు జీవనశైలి ఎక్కడ గొంగళి అక్కడే ఉందన్నారు. నగరంలో గిరిజనులకు ఆధార్ కార్డు లేకపోవడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ శాఖ గిరిజన కాలనీలు గుర్తించి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి ఆధార్ కార్డులు ఇప్పించాలని కోరారు. జీవనోపాధి లేక యానాదులు హాస్పిటల్లలో, ప్రైవేట్ స్కూళ్లలో కార్మికులుగా పని చేస్తున్నారని, వారి కులవృత్తుల ప్రకారం ఉపాధి చేకూర్చేలా కోరారు. సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎస్టీ కార్పొరేషన్ వరలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో ట్రాఫిక్ ఇబ్బందులు


రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీ

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున ఉన్న ఇస్లాంపేట ప్రజలను ట్రాఫిక్ సమస్య తరచుగా వేధిస్తోంది. ఇస్లాంపేట మొదటి లైన్ మొదలుకొని ప్రధాన వీధుల్లో పెద్దపెద్ద వాహనాలు రావడం, కార్ల రాకపోకలు పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మొదటి, రెండో వీధిలోని కుక్కల బజారులో సరకు రవాణా లారీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ట్రాలీ ఆటోలు తిరగడం ఎక్కువైపోయింది. ఒకేసారి రెండు మూడు వాహనాలు రావడంతో వీధుల్లో కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. నిబంధనలకు వ్యతిరేకంగా పగటి పూట కూడా ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, 10 టైర్ల లారీలు సరుకులను దించేందుకు వస్తున్నాయి. గంటల తరబడి దారికి అడ్డంగా నిలిపి వేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు సమయం వృథా అవుతోంది. ఇంత ఇబ్బంది పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు ఇటువైపుగా తొంగిచూడటం లేదు. మామూళ్లకు అలవాటు పడిపోయి చూసి చూడనట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఇస్లాం పేట ప్రజలు కోరుతున్నారు.

'మోడల్' నెపంతో పాఠశాలల కుదింపు ఆపాలి

- ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

ఒంగోలు సిటీ: ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల నెపంతో విద్యార్థుల తరలింపు, పాఠశాలలను కుదించడాన్ని వెంటనే ఆపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటరావు, బి.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కావడం వల్ల పేద, మధ్య తరగతి పిల్లలు డ్రాపౌట్స్‌గా మిగిలిపోయి విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాబట్టి అన్ని పంచాయతీల్లో విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ జీఎల్ఐ, పీఎఫ్, సరెండర్ లీవ్ తదితర బకాయిలు, రిటైర్ అయిన వారికి అన్ని రకాల బెనిఫిట్స్ వెంటనే చెల్లించి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని కోరారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, కమిషన్ రిపోర్ట్‌ను అమలు చేసే వరకు 30% మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ నేతలు ప్రభుత్వం ముందుంచిన సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణం లో పనిచేసేలా చూడాలని పీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

కొత్తపట్నం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే సుఖప్రసవంతో బిడ్డ ఆరోగ్యంగా జన్మనిస్తారని కొత్తపట్నం పీహెచ్ డాక్టర్ వైష్ణవి అన్నారు. గర్భిణులకు పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం, గర్భం దాల్చడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కె.పల్లెపాలెంలో హెల్త్ క్లీనిక్ సెంటర్‌లో 60 మంది గర్భిణులు, వారి సహాయకులకు దాత ఆశారావు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యదీపిక, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.


గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ వైష్ణవి, రమ్యదీపిక

సచివాలయాలను తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు, బొడ్డువారిపాలెం సచివాలయాలను మంగళవారం జిల్లా పరిషత్ సీఈవో బీ చిరంజీవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనిపించని వృద్ధులు, స్థానికేతరులు, చైల్డ్ ఆధార్, ఆక్రమణల సర్వేలను నూరు శాతం పూర్తి చేయాలని సీఈవో చిరంజీవి సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ సురేష్‌బాబు, సచివాలయం కార్యదర్శి పీ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.